# తీన్మార్
నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి: 04 | సంచిక: 254 | పేజీలు : 8 | శనివారం 21 మార్చి 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad



తీన్మార్ మెల్కొల్పు
చట్టం & న్యాయం లపై.....
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తలపెట్టిన మెల్కొల్పు కార్యక్రమంలో
భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు
రచనలు, కవితలు & వ్యాసాలు
-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-
teenmaardesk@gmail.com


# బడ్జెట్‌లో ప్రజాసంక్షేమం

సన్నవడ్లకు 500 బోనస్

రైతు భరోసా, బీమా పథకాలకు పెద్దపీట

విద్యార్థులకు తీపి కబురు

కళ్యాణ లక్ష్మి సాయం 1.30 లక్షలకు పెంపు





హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్):

ఈసారి బడ్జెట్‌లో ప్రజాసంక్షేమం, విద్య, వ్యవసాయ రంగాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.సన్నవడ్లకు 500 రూపాయల బోనస్, సబ్సిడీ బియ్యం పథకాలకు నిధులు కేటాయించబోతున్నారు. రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకాలకు భారీ కేటాయింపులు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇక కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి నిధులు, పాఠశాలల్లో ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ ప్రతిపాదించే అవకాశం ఉంది . దీని వల్ల 21 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. అలాగే గిరిజనుల కోసం - మిగతా2లో



## గల్ఫ్ సంక్షోభం ఎఫెక్ట్

### పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలు

### మూతపడుతున్న బంకులు

హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్):


ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని దేశాలకు సుమారు సగానికిపైగా గల్ఫ్ దేశాల నుంచే చమురు సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం పశ్చిమాసియా ఉద్రిక్తల నేపథ్యంలో గల్ఫ్ దేవాల నుంచి వచ్చే చమురు మొత్తం ఆగిపోయింది. దీంతో భారత్ సహా అనేక దేశాల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత ఏర్పడింది. ఇక - మిగతా2లో

## హైదరాబాద్ మెట్రోలో నూతన అధ్యాయం



- ప్రభుత్వం చేతికి ప్రాజెక్టు
- రెండో దశ విస్తరణకు రూ. 600 కోట్లు
- నగర రవాణాలో కీలక మైలురాయి

## తెలంగాణలో టెన్త్ పరీక్షలు రద్దు



- విద్యావ్యవస్థలో సర్కార్ సంచలన మార్పులు
- ఒకే గొడుగు కిందకు నర్సరీ టు ఇంటర్
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం

హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం షాకింగ్ నిర్ణయం తీసుకుంది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు శుక్రవారం (మార్చి 20) రేవంత్ సర్కార్ ప్రకటించింది. బదులుగా నర్సరీ నుండి 12వ తరగతి వరకు ఒకే విధానం అమలు చేయనున్నట్లు నిర్ణయించింది. ఈ మేరకు విద్యా విధానంలో కీలక మార్పులు తెస్తున్నట్లు రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ - మిగతా2లో

## రేవంత్ సర్కార్‌ది 'ఫేక్, రివిజన్' బడ్జెట్



నిప్పులు చెరిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత



## తెలుగు రాష్ట్రాల్లో రెండ్రోజులు వర్షాలు

### ఆపై నిప్పుల కొలిమి.. వాతావరణ శాఖ అలర్ట్

హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్):

గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎండవేడి నుంచి కాస్త ఉపశమనం దొరికందనుకున్న తెలుగు రాష్ట్రాలకు ప్రజలకు వాతావరణ శాఖ బ్యాడ్ న్యూస్ చెప్పింది. రాబోయే రెండ్రోజులు వర్షాలు కురువబోతున్నప్పటికీ.. ఇతర్వాతి రెండ్రోజుల్లో ఉష్?ణ్గ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. కోస్తా ఆంధ్ర ప్రదేశ్ యానం తీర ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల చక్రవాత ఆవర్తనం ఈరోజు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కోస్తా ఆంధ్ర తీరానికి సమీపంలో సగటు సముద్రమట్టం నుండి 3.1 కి మీ ఎత్తులో కొనసాగుతోందని. నిన్న గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి దక్షిణ అంతర్గత కర్నాటక వరకు కొనసాగిన ద్రోణి ఈరోజు గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి తమిళనాడు, దక్షిణ అంతర్గత కర్నాటక మీదుగా ఉత్తర అంతర్గత - మిగతా2లో

## కేసీఆర్‌ను గృహనిర్బంధం చేసిన అల్లుడు, కొడుకు

### సీఎం రేవంత్ రెడ్డి షాకింగ్ కామెంట్స్

### ఫోన్ ట్యాపింగ్ కేసుపై క్లారిటీ



హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రాష్ట్ర విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురాబోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, రాష్ట్ర రాజకీయాలు, ఆర్థిక పరిస్థితి మరియు కీలక కేసులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ మార్పుపై కమిటీ అధ్యయనం చేస్తోందని, జాతీయ స్థాయి ప్రమాణాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో చట్టప్రకారమే ముందుకు వెళ్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు అందుబాటులో లేకపోవడం వల్లే దర్యాప్తు ఆలస్యమైందని, కేసు కొట్టేసినట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని కొట్టిపారేశారు. మేము అధికారంలోకి వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పు చేశాం. అందులో రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పుల అసలు, వడ్డీలు కట్టడానికే సరిపోయింది - మిగతా2లో



## ఆరు గ్యారంటీలకు పాడె కట్టారు

### ఇదొక అంకెల గారడీ

### బడ్జెట్‌పై బండి సంజయ్ నిప్పులు

హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిప్పులు చెరిగారు. ఈ బడ్జెట్ ప్రజలను వంచించేలా ఉందని, కేవలం అంకెల గారడీతో ప్రజలను దగా చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టిందని ఎద్దేవా చేశారు. ఆదాయం పెంచుకోవడం చేతకాక, అప్పుల కోసం అర్రులు చాచే బడ్జెట్ ఇది. మరో రూ. లక్ష కోట్లు అదనంగా అప్పు భారం మోపాలని చూడటం సిగ్గుచేటు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే - మిగతా2లో

## కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు

### 2026-27 విద్యా సం.కి నోటిఫికేషన్ విడుదల

### ఏప్రిల్ 2 వరకు దరఖాస్తుకు అవకాశం




తెలంగాణ బ్యూరో, మార్చి 20 (తీన్మార్ న్యూస్):

దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో (కేవీ) 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతితోపాటు బాల్‌వాటికల్లో ప్రవేశాలకు అధికారిక నోటిఫికేషన్ విడుదలైంది. విద్యార్థులు తల్లిదండ్రులు మార్చి 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఏప్రిల్ 2, 2026వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. కేవీల్లో ప్రవేశాలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్మీ సిబ్బంది పిల్లలకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. ఇందులో కొన్ని సీట్లను వివిధ కోటాలు, రిజర్వేషన్ల ప్రాతిపదికన భర్తీ చేస్తారు. ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందగోరే విద్యార్థుల వయసు 2026 మార్చి 31వ తేదీ నాటికి ఆరేళ్లు నిండి ఉండాలి.

**ముఖ్యమైన తేదీల వివరాలు:**

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేదీ: మార్చి 20, 2026.
దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 2, 2026.
తొలి ఎంపిక జాబితా - మిగతా2లో

## కేసీఆర్‌ను గృహనిర్బంధం చేసిన అల్లుడు, కొడుకు

-మొదటిపేజీ తరువాయి

కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమే వాడుకున్నాం" అని వివరించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ జాతీయ జీడీపీ కంటే మెరుగ్గా ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై స్పందిస్తూ.. అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ పట్టుబడుతున్నా బీజేపీ నేతలు నోరు మెదపకపోవడం, బీఆర్‌ఎస్–బీజేపీ మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందానికి నిదర్శనమని ఆరోపించారు. హిల్ట్ పాలసీ, టీడీఆర్ అంశాలపై కేటీఆర్, హరీష్ రావులకు ఏ ఏజెన్సీతోనైనా విచారణకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. జీఎస్టీ వసూళ్లు గత రెండు నెలల్లో రూ.4 వేల కోట్లు దాటడం రాష్ట్ర ఆర్థిక స్థితిగతులకు సానుకూల సంకేతమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## రేవంత్ సర్కార్‌ది 'ఫేక్, రివిజన్' బడ్జెట్

హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్)

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్ అంటూ నిప్పులు చెరిగారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో అన్ని వర్గాల వారిని మోసం చేస్తారని కవిత మండిపడ్డారు. బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు అందరినీ మోసం చేశారని కవిత ధ్వజమెత్తారు. ఒక్కో కుటుంబంపై రూ.9లక్షల అప్పుమోపారన్నారు. బడ్జెట్ లో తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఒకరిని మించి ఒకరు ఫేక్ ముచ్చట్లు చెబుతున్నారని మండిపడ్డారు.మోడీ బడే భాయ్ అని ఢిల్లీకి పోయి వందరూపాయలు కూడా తేలేదని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ మా హైదరాబాదీ సలీం ఫేక్ లాంటి వ్యక్తి అన్న కవిత సలీం ఫేక్ కనీసం ప్రజలను నవ్విస్తాడు.. కానీ రాహుల్ మా ప్రజలను ఏడిపిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వం ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వమని కవిత పేర్కొన్నారు. అందుకే ఇక నుంచి రాహుల్ గాంధీకి "రాహుల్ ఫేక్" అని నామకరణం చేస్తున్నాం అన్నారు కవిత. రైతు భరోసా చేయూత పింఛన్లు సహా చాలా రంగాలకు గతేడాది కేటాయించిన నిధులను అక్షరం మార్చకుండా అలాగే కొత్త బడ్జెట్లో పెట్టారన్నారు. ఈ ప్రభుత్వానికి విజన్ లేదని అందుకే రివిజన్ బడ్జెట్ అంటున్నామని తెలిపారు. ఏటా బీసీలకు 20 వేల కోట్లు కేటాయిస్తామన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఫేక్ చెప్పారని మాత్రం నాలుగు శాతం నిధులు కేటాయించి బీసీలను మోసం చేశారన్నారు. లక్షల కోట్ల అప్పులు తెస్తున్న రేవంత్ సర్కార్ ఆ డబ్బులను ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రజలకు పైసా మేలు జరగలేదన్నారు. మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని స్కీమ్ ఈసారి కూడా పత్తా లేకుండా పోయిందన్నారు.ఇందిరమ్మ ఇళ్లకు గతేడాదితో పోలిస్తే ఈసారి ఏడు వేల కోట్ల రూపాయల కోత పెట్టారన్నారు. కొత్త ఉద్యోగాల నియామకాలకు ఎటువంటి కేటాయింపులు లేవని, తెలంగాణ నిరుద్యోగంలో రైజింగ్ అంటూ కవిత వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల పైన కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసుకుంటుందని మండిపడ్డారు. కేవలం 13 వేల ఉద్యోగాలను భర్తీ చేసి 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు కవిత.

## రూ. 3.24 లక్షల కోట్లతో భట్టి ప్రసంగం

**సభ నుంచి బీఆర్‌ఎస్ వాకౌట్**

**చెవిలో పూలతో నిరసన**

**మోసం.. మోసం అంటూ నినాదాలు**

**అసెంబ్లీని వాయిదా వేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**



హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ శాసనసభ వాయిదా పడింది. ఈరోజు సభలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు ఆర్థిక మంత్రి. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు. బడ్జెట్ ప్రసంగం పూర్తి అయిన అనంతరం స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. కాగా... ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం కొనసాగతుండగానే సభ నుంచి బీఆర్‌ఎస్ వాకౌట్ చేసింది. అన్ని వర్గాలను మోసం చేశారంటూ.. చెవిలో పూలు పెట్టుకుని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను చించివేశారు. బడ్జెట్ మొత్తం మోసం.. మోసమంటూ బీఆర్‌ఎస్ సభలో నిరసనలు తెలిపింది. ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవంటూ బీఆర్‌ఎస్ నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. సభ నుంచి బీఆర్‌ఎస్ నేతల వాకౌట్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రసంగం ముగిసే వరకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నీళ్లు కూడా తాగలేదన్నారు. కానీ బీఆర్‌ఎస్ నేతలు మాత్రం బడ్జెట్‌ను విమర్శిస్తూ చెవిలో పువ్వులు పెట్టుకొని వెళ్లిపోయారని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్ రావు బడ్జెట్ ప్రతులను చించివేయడం బాధాకరమన్నారు. ఈ బడ్జెట్ పేదలు, బీసీ, ఎస్సీ, విద్యార్థులకు ఉపయోగకరమైనదన్నారు. పేదలు, విద్యార్థుల గురించి మాట్లాడే సమయంలోనే బీఆర్‌ఎస్ వాళ్లు వెళ్లిపోయారని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

## ఆరు గ్యారంటీలకు పాడె కట్టారు

-మొదటిపేజీ తరువాయి

కదా అని ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారు అని మండిపడ్డారు. ఎన్నికల హామీలైన తులం బంగారం తుస్ అనిపించారని, మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 ఊసే లేదని ధ్వజమెత్తారు. రైతు భరోసా పైసలు ఎగ్గొట్టారని, కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని, విద్యార్థులకు ఇస్తామన్న రూ. 5 లక్షల భరోసా కార్డుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. విద్యాశాఖకు 16 శాతం నిధులు ఇవ్వాలని కమిషన్ చెబితే, కేవలం 8 శాతానికే పరిమితం చేశారన్నారు. ఆరోగ్యశ్రీకి పాత బకాయిల కంటే తక్కువ కేటాయింపులు ఉన్నాయని ఎద్దేవా చేశారు. 56 శాతం ఉన్న బీసీలకు కేవలం 4 శాతం నిధులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. దేవాదాయ శాఖ ప్రస్తావనే లేదని, పుష్కరాలకు కంటితుడుపు కేటాయింపులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ఆర్థిక మంత్రి చెప్పడం అబద్ధమని, ఆ వివరాలు వెల్లడించే దమ్ముందా అని సవాల్ విసిరారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అప్పుల భాగోతంపై విచారణ జరిపిస్తామని బండి సంజయ్ హెచ్చరించారు.

## హైదరాబాద్ మెట్రోలో నూతన అధ్యాయం

హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్):

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ రెండో దశ విస్తరణ పై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో కీలక ప్రకటన చేశారు. 2026– 27 ఆర్థిక సంవత్సరానికి మూడు లక్షల 24 వేల 234 లక్షల కోట్ల బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెడుతూ, ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో మెట్రో కీలకపాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర రవాణా చరిత్రలోనే సాహసోపేతమైన నిర్ణయంగా తెలంగాణ ప్రభుత్వ అధీనంలోకి మెట్రో రైలు ప్రాజెక్టును తీసుకురావడం గురించి భట్టి విక్రమార్క మాట్లాడారు. ఎల్ అండ్ టి సంస్థ నుండి మెట్రో రైలు ప్రాజెక్టు తెలంగాణ ప్రభుత్వ అధీనంలోకి తీసుకు వస్తున్నట్టుగా తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో రైలుకు రోజుకు దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులకు తన సేవలు అందిస్తుంది అన్నారు. మెట్రో రెండో దశ కింద పాతబస్తీకి మెట్రో సేవలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుందని, కొత్త కారిడార్లను నిర్మించి, మొత్తం నెట్వర్క్ ని విస్తరించడం కోసం ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని అన్నారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ అవసరాలను తీర్చడానికి మెట్రో రైల్ విస్తరణ కీలకంగా మారిందని ఆయన అన్నారు. పాతబస్తీతోపాటు శంషాబాద్ విమానాశ్రయానికి, హైటెక్ సిటీ నుండి ఇతర ప్రాంతాలకు మెట్రో విస్తరణ అవసరమని పేర్కొన్న ఉపముఖ్యమంత్రి, మెట్రో రైలు రెండవ దశ పనుల కోసం 600 కోట్ల రూపాయలను కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నిధులు మెట్రో ప్రాజెక్టు పనులకు ఊతమిస్తాయని భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తం మెట్రో నిర్మాణానికి 24 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని పేర్కొన్న ఆయన ఈ భారీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇతర అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాల రూపంలో సమీకరించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లుగా తెలిపారు.హైదరాబాద్ రెండవ దశలో భాగంగా 76.4 కిలోమీటర్ల పొడవైన కొత్త మెట్రో మార్గాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలను రచిస్తుంది అన్నారు.

## మెడికల్ సీట్ల భర్తీపై సుప్రీంకోర్టు ఆదేశం

**తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు నోటీసులు**

**కౌన్సెలింగ్ గడువు పెంపుపై పీటముడి**

**ఎన్‌ఎంసీ మౌనంపై న్యాయవాదుల వాదన**



తెలంగాణ బ్యూరో, మార్చి 20 (తీన్మార్ న్యూస్):

తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ పీజీ సీట్ల భర్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టును వైద్య విద్య కళాశాల యాజమాన్యాలు ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28వ తేదీతో కౌన్సెలింగ్ ముగిసిందని తెలిపాయి. ఆ తేదీకి ఆంధ్రప్రదేశ్‌లో 246 సీట్లు, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని న్యాయస్థానం దృష్టికి కాలేజీ యాజమాన్యాలు తీసుకువచ్చాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరపు న్యాయవాదులు తీసుకువచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని యాజమాన్యాలు ప్రస్తావించాయి. గడువు పెంచాలని ఫిబ్రవరి 28వ తేదీకి ముందే జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేశాయి. యాజమాన్యాలు విజ్ఞప్తి చేసినా ఎలాంటి సమాధానం రాలేదని కోర్టుకు న్యాయవాదులు చెప్పారు. ఇదే పరిస్థితి తలెత్తితే కర్ణాటక, మహారాష్ట్రల్లో గడువు పెంచారని, కానీ తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు మాత్రం గడువు పెంచేందుకు నిరాకరించాయని న్యాయవాదులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కోర్టు ముందు న్యాయవాదులు ఉంచారు. వైద్య విద్య కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ధర్మాసనం తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను ఆదేశించింది. ఎన్‌ఎంసీకి పిటిషన్ కాపీలు అందజేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకి చెప్పారు. అయితే, ఈ కేసు పూర్తి స్థాయి విచారణ సోమవారం (23న) చేపడతామని జస్టిస్ పీఎస్ నర్సింహ ధర్మాసనం తెలిపింది.

## యుద్ధ మేఘాల నడుమ "భారత్‌కు ఇరాన్ అభయం"

**ఎల్పీజీ నౌకలకు సురక్షిత మార్గం**

**తీరానికి చేరిన జగ్ లాడ్కి, శివాలిక్**

తీన్మార్ న్యూస్ డెస్క్, మార్చి 20 (తీన్మార్ న్యూస్):

దేశంలో నెలకొన్న ఎల్పీజీ కొరత పట్ల ఇరాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భారత్‌ను తమ మిత్రదేశంగా, భాగస్వామిగా అభివర్ణించిన ముంబైలోని ఇరాన్ కాన్సుల్ జనరల్ సయీద్ రెజా మొసయెబ్ మొట్లాగ్ పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ భారత్‌కు వచ్చే గ్యాస్ క్యారియర్లకు సురక్షితమైన మార్గాన్ని కల్పించామని స్పష్టం చేశారు. వార్తా సంస్థ ఐఏఎన్‌ఎస్ తో ఆయన మాట్లాడుతూ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ మొదటి నుంచి భారత్‌కు మిత్రదేశంగా, భాగస్వామిగా ఉంటూ వస్తోంది. ప్రజలు గ్యాస్ కొరతను ఎదుర్కోవడం చూసి ముంబైలోని ఇరాన్ కాన్సుల్ జనరల్‌గా నేను తీవ్రంగా కలత చెందాను అని అన్నారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితులు యుద్ధాన్ని తలపిస్తున్నాయి. గ్యాస్ క్యారియర్లకు ఇలాంటి పరిస్థితుల్లో ముప్పు ఎక్కువ. చిన్న ప్రమాదం జరిగినా తీవ్ర పరిణామాలు ఉంటాయి. అయినప్పటికీ, దేవుడి దయ వల్ల ఈ నౌకలు భద్రంగా దాటేలా ఇరాన్ సురక్షిత మార్గాన్ని కల్పించింది. ఇది భారత్‌తో మాకున్న స్నేహానికి, సంఘీభావానికి నిదర్శనం అని ఆయన వివరించారు.



పశ్చిమాసియాలో ఘర్షణల కారణంగా భారత్‌లో ఎల్పీజీ కొరత ఏర్పడిన వేళ కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. దాదాపు 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురుతో వస్తున్న భారతీయ నౌక జగ్ లాడ్కి గుజరాత్ తీరానికి చేరుకుంది. అంతకుముందు, ఖతార్ నుంచి 40,000 మెట్రిక్ టన్నుల వంట గ్యాస్‌తో వస్తున్న ఎల్పీజీ ట్యాంకర్ శివాలిక్ యుద్ధ వాతావరణం నెలకొన్న హోర్ముజ్ జలసంధిని దాటి గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, పెర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో హోర్ముజ్ జలసంధికి పశ్చిమంగా మొత్తం 22 భారతీయ నౌకలు ఉన్నాయి. ప్రపంచంలో ముడి చమురును అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న మూడో అతిపెద్ద దేశం భారత్. తన చమురు అవసరాల్లో 88 శాతాన్ని విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. భారత్ రోజుకు 5.8 మిలియన్ బ్యారెళ్ల చమురును వినియోగిస్తుండగా, అందులో 2.5 నుంచి 2.7 మిలియన్ బ్యారెళ్లు సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ వంటి పశ్చిమాసియా దేశాల నుంచి హోర్ముజ్ జలసంధి గుండానే వస్తున్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. దేశీయంగా వినియోగించే 55 శాతం వంట గ్యాస్, విద్యుత్, ఎరువులు, సీఎన్‌జీకి ఉపయోగించే 30 శాతం ఎల్ఎన్‌జీ ఈ మార్గం గుండానే సరఫరా అవుతుండటం గమనార్హం.

## తెలంగాణలో టెన్త్ పరీక్షలు రద్దు

-మొదటిపేజీ తరువాయి

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు పదో తరగతి పరీక్షలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా విధానానికి భిన్నంగా, సరికొత్త పద్ధతిని ప్రవేశపెట్టనున్నట్లు సీఎం తెలిపారు. బదులుగా ఏకీకృత విధానం తీసుకొస్తు?న్నట్లు పేర్కొన్నారు. ఇకపై నర్సరీ నుంచి 12వ తరగతి (ఇంటర్మీడియట్) వరకు విద్యార్థులకు ఒకే రకమైన విద్యా విధానాన్ని అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పదో తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసి, విద్యా సంవత్సరాన్ని కొనసాగించేలా మార్పులు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. స్కూల్ విద్య నుంచి కాలేజీ విద్య వరకు ఎక్కడా అడ్డంకులు లేకుండా విద్యార్థులు తమ చదువును కొనసాగించేలా ఈ కొత్త విధానం దోహదపడనుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ చేసిన ఈ ప్రకటన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తి నెలకొంది. అనంతరం సీఎం రేవంత్ బడ్జెట్ గురించి మాట్లాడుతూ ఇది సంక్షేమ అభివృద్ధి బడ్జెట్. రెవెన్యూ పెరిగింది. మేము అప్డేట్ అవుతున్నాం. రేషన్ కార్డు ఉన్నవాళ్లకి ఇందిరమ్మ బీమా పథకం అమలు చేస్తాం. పిల్లలకు బ్రేక్ఫాస్ట్ పథకం తెచ్చినందుకు బీఆర్‌ఎస్ చెవిలో పువ్వులు పెట్టుకుంటున్నారు. గత ప్రభుత్వ అప్పులకు 3 లక్షల 30 వేల కోట్లు వడ్డీ కడుతున్నాం. 17 వేల కోట్లు సంక్షేమానికి వాడామని అన్నారు.

## గల్ఫ్ సంక్షోభం ఎఫెక్ట్

-మొదటిపేజీ తరువాయి

దిగుమతి తగ్గడంతో ఆటోమేటిక్‌గా పెట్రోల్, డీజిల్‌కు డిమాండ్ పెరిగింది. కాగా డిమాండ్‌కు తగిన సప్లై లేకపోవడంతో ఆయా కంపెనీలు సైతం పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచుతున్నాయి. తాజాగా పవర్ పెట్రోల్‌పై రూ.2.26పైసలు పెరగ్గా ఇండస్ట్రియల్ డీజిల్‌పై రూ.22 పెరిగింది. అంతేకాదు రాబోయే రోజుల్లో సాధారణ పెట్రోల్ సైతం పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా నగరం శివారులోని పెట్రోల్ బంకుల్లో నోస్టాక్ బోర్డులు దర్శనమివ్వడంపై, ధరలపై పెరుగుదలపై తెలంగాణా పెట్రోలియం డీలర్స్ ప్రెసిడెంట్ అమరేందర్‌రెడ్డి స్పందిచారు. ప్రస్తుతం పవర్ పెట్రోల్‌పై రూ.2 పెరిగిందని రాబోయే రోజుల్లో సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అయితే సాధారణ పెట్రోల్‌పై ఎంత పెరుగుతుంది అనేది వాళ్లకు క్లారిటీ లేదని, డాలర్ విలువ పెరిగిన నేపథ్యంలో చమురు బ్యారెల్ ధర కూడా పెరుగుతుందని.. ఆ భారం ప్రభుత్వం పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో పెట్రల్, డీజిల్ ధరలు కూడా పెరవచ్చని ఆయన అంచనా వేశారు. అయితే గతంలో కంపెనీలు క్రెడిట్ ఇచ్చేవని దానితో డబ్బులు సరిగ్గా లేకపోయినా ఎలాగోలా బంకులు నడిపించే వారని.. కానీ ప్రస్తుతం ఆయిల్ కంపెనీలు క్రెడిట్ ఇవ్వడం మానేశాయని.. దానికి తోడు పాత క్రెడిట్ కూడా చెల్లించడంతో పాటు పెట్రోల్, డీజిల్ కావాలంటే అడ్వాన్స్ కూడా కట్టాలంటున్నాయని ఆయన తెలిపారు. తీసుకొచ్చిన ఇందనం అయిపోయే లోపు డబ్బు సమకూర్చడం అంటే డీలర్లకు సాధ్యం కాదని.. ఈ కారణంతోనే దాదాపు 40 శాతం వరకు పెట్రోల్ బంక్‌లు మూతపడ్డాయని తెలిపారు. ఇంతకుముందు డీలర్లు అడగకపోయినా ఆయిల్ కంపెనీలు క్రెడిట్ ఇచ్చేవని.. కానీ ఇప్పుడు ఇవ్వడం మానేసి వాళ్ల డబ్బులు వసూలు చేసుకునేందుకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నాకరని డీలర్స్ చెబుతున్నారు. దీనికి తోడు రాబోయే రోజుల్లో పెట్రోల్ కొరత ఏర్పడవచ్చనే భయంతో జనాలు ముందే ఎక్కువ మొత్తంలో పెట్రోల్ తీసుకెళ్లడం వల్ల కూడా కొరత ఏర్పడిందని నిపుణులు చెబుతున్నారు.పెట్రోల్ వినియోగంపై ప్రభుత్వం కూడా ప్రజలకు అవగాహనా కల్పిస్తే ఈ కొరత తగ్గవచ్చని సూచిస్తున్నారు.

## బడ్జెట్‌లో ప్రజాసంక్షేమం

-మొదటిపేజీ తరువాయి

కొత్త చట్టానికి సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావించబోతున్నట్టు తెలుస్తోంది. దేవాదాయ శాఖలో వృద్ధ అర్చకులకు పెన్షన్ ఇచ్చే ప్రతిపాదన ఉండబోతుందున్నట్లు తెలుస్తోంది. పారా అథ్లెట్లకు ఇళ్ల స్థలాలు, ప్రోత్సాహకాల కోసం నిధులు కేటాయించే అవకాశం ఉంది. అలాగే కల్యాణ లక్ష్మి కింద అదనంగా 30 వేల రూపాయలు ఇచే అంశాన్ని ప్రతిపాదించబోతున్నారు. అప్పుడు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి కింద అందించే మొత్తం లక్షా 30 వేలు అవుతుంది. ఈ సారి బడ్జెట్‌లో ఉద్యోగుల ఈ హెచ్ ఎస్ హెల్త్ స్కీమ్ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించబోతున్నట్టు సమాచారం.

## తెలుగు రాష్ట్రాల్లో "రెండ్రోజులు వర్షాలు"

-మొదటిపేజీ తరువాయి

కర్నాటక వరకు సగటు సముద్ర మట్టం నుండి 0.9 కి మీఎత్తులో కొనసాగుతోందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రెండ్రోజులు పాటు తేలికపాటు నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. హైదరాబాద్ వాతావరణ కేంద్ర ప్రకారం.. రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి నుంచి రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని.. దీంతో రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఉరుములు మెరుపులు మరియు 30 నుండి 40 కి.మీ వేగంతో కూడిన ఈదురుగాలులుతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాతి నాలుగు రోజులలో సాధారణ స్థాయి నుంచి క్రమేపీ రెండు నుంచి నాలుగు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ఇక ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి కొనసాగుతున్నదని.. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా జిల్లాలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. అలాగే వర్షం సమయంలో గంటకు 40 –50 కిలోమీటర్లు గరిష్టముగా 60 కిలోమీటర్లు వేగముతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. ఇక రాలసీమలోని కొన్ని జిల్లాల్లోనూ రాబోయే మూడు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని.. వర్షం సమయంలో గంటకు 30–40 కిలోమీటర్లు గరిష్టముగా 50 కిలోమీటర్లు వేగముతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

## కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు

-మొదటిపేజీ తరువాయి

(బాల్‌వాటికలకు): ఏప్రిల్ 8 తొలి ఎంపిక జాబితా ఒకటో తరగతికి: ఏప్రిల్ 9 రెండో జాబితా విడుదల తేదీ: ఏప్రిల్ 16 మూడో జాబితా విడుదల తేదీ: ఏప్రిల్ 21 ఒకటో తరగతి, బాల్‌వాటికల్లో ఒకటి, రెండో, మూడో తరగతి ప్రవేశాలకు మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. మిగిలిన తరగతుల్లో ఖాళీలను బట్టి ఆయా కేవీ విద్యాలయాల్లో స్వయంగా వెళ్లి దరఖాస్తులు సమర్పించవల్సి ఉంటుంది.




బాల్‌వాటిక 2, రెండో తరగతి నుంచి (11వ తరగతి మినహా) 9వ తరగతి వరకు ఖాళీలను బట్టి ఏప్రిల్ 2 నుంచి 8 వరకు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వీటి ఎంపిక తొలి జాబితా ఏప్రిల్ 13న విడుదలవుతుంది. అడ్మిషన్లు ఏప్రిల్ 15 నుంచి 20 మధ్య జరుగుతాయి. మొత్తం ప్రక్రియ జూన్ 30తో ముగుస్తుంది. ఇక పదో తరగతి ఫలితాలు వచ్చిన 10 రోజుల తర్వాత రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత కూడా సీట్లు మిగిలితే డిప్యూటీ కమిషనర్ ప్రత్యేక అధికారాలతో జులై 7వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంది.

